

కవిత్వం

# వాక్యాంతరం

మువ్వా శ్రీనివాసరావు

# వాక్యాంతం

**మువ్వా శ్రీనివాసరావు**

కవిత్వం


ప్రథమ ముద్రణ : మార్చి 2019

కవర్ పెయింటింగ్ : మోషే దయాన్

డిజైన్ : గిరిధర్ ఎ.

ప్రతులు : 2000

ప్రచురణ : మువ్వా పద్మావతి, రంగయ్య ఫౌండేషన్ - ఖమ్మం

ప్రతులకు :

మువ్వా శ్రీనివాసరావు, 103, సృజన అపార్ట్‌మెంట్స్, బ్యాంక్ కాలనీ, ఖమ్మం

సెల్ : 99480 99900

e-mail : kranthisrinivasarao@gmail.com

ప్రజాశక్తి బుక్ హౌస్, నవతెలంగాణ బుక్ హౌస్,

విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

e_book : kinige.com

ముద్రణ : శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ-520 002, సెల్ : 9490634849

వెల : ₹ 200

## కొత్త దుఃఖం

ఇంకా వెలవని వానలో
ఒకటీ అరా చినుకుల శబ్దంలా
పూర్తిగా ఇంకిపోని దుఃఖం
మాట్లాడుతూనే ఉంది...

తడిసిన రెక్కల విదిలింపు చప్పుడులా
మొలకెత్తబోతున్న విత్తనం పులకరింతలా
సత్యం ధ్వనిస్తూనే ఉంది

తీగమీద జారిపోక
కవాతుచేస్తున్న నీటి చుక్కల్లా
గాలికి వింత వింత వింజామరలైన వృక్షాల్లా
ఆశ పలకరిస్తూనే ఉంది

వాన ఎప్పటిలానే వెలసిపోయింది
ఆకాశం
సముద్రం మీద ఆరేసుకొన్న చీరకోసం
చంద్రుడు ఎగబడినట్లు
కొత్త దుఃఖం కోసం
పరుగులూ మొదలయ్యాయి

# ఎంగిలి చందమామ

దూరంగా..
తొంభై ఏళ్ల ముసలాడిలా
నవ్వుతున్న దీపం
నీడ దుప్పటి ముసుగేసుకుని
కునుకు తీస్తున్న దారి
రోజూ
సాయంత్రం రచించిపోతున్న ద్విపదకావ్యం

అదే
నన్ను నేను లంగరేసుకొని
కాసేపు విశ్రాంతి మందిరమై పోయేచోటు
అదే
జీవం, నిర్జీవం
ఉమ్మడిగా
ఒకే గడియారాన్ని నమ్ముకునే చోటు
అదే –
అదేలాగా
రోజూ చందమామను ఎంగిలించి నిన్నను,
నేటిని అందంగా దొంగిలించి పోయే చోటు
అదే –
వెలుతురులోకి తొంగి చూసే చీకటి
చీకటిని తేరిపార చూసే వెలుతురు

# గురూ...

గురూ ఎందుకిలా ఒక్కోసారి
భూ అయస్కాంత క్షేత్రం తిరగబడితే
సౌర తుఫానులో తగలబడుతున్నట్లు
కళ్లలోపల ఏదో కదిలిపోతున్నట్లు
లోతుల్లోతుల్లోకి కూరుకుపోతున్నట్లు
నిద్రగాయాలను వెదుక్కొంటున్నట్టు
మనలోంచి ఏదో తరలిపోతున్నట్లు
ఆకాశ సౌధ సోపానాల నుండి
జారి బద్దలు బద్దలై దొర్లిపోతున్నట్లు
మన మాటలు మనకే అపార్థమై
ఒక్క సంభాషణలోనే అంతమైపోతాం
ఏ ఆవేశం లేకున్నా ఓ చిన్న న్యూట్రానే
యురేనియం కేంద్రకాన్ని బద్ధలు చేసినట్లు
ఒక మాటేదో మనసు కేంద్రకంలో చేరి ధ్వంసమైపోతాం
శోకపు చుక్కలై రాలి పడుతుంటాం
రెక్కలు విరిగి మననుండి మనమే
ఎగరలేక పడిపోతుంటాం
మనని మనమే ఎరగలేక పోతుంటాం ఎందుగ్గురూ...

## PARADOX

అసలు వెలుతురుంటేనే చీకటి
చీకటి ఉంటేనే వెలుతురు
వెలిగి మలగటమే
వెతుకులాటకు మూలం

ఈ సంక్లిష్టత అర్థం కాకే
దుఃఖం ఉండటం
ఉండకపోవటమే
ఇప్పుడు అనుభవించే ఆనందమయ్యింది
సున్నా నుండి కిందికే లెక్కలన్నీ
మైనస్‌లో గుడ్నెస్ వెతుక్కోవడమే
ఇప్పటి తరీఖా
చలిగాల్లో ఎండకాగడం
సెనగగింజల్లో బెల్లం నంజుకోవడం
తెలిసుంటే చాలు సాఫీగా లాగించెయ్యవచ్చు
కందిరీగ కలల నిండా
తేనెలంటినా
భగ్నమయితే విరిచే ముళ్లనిండా
విషబిందువులేనని
నింగిలోని నిండు చందమామ
ప్రశాంతం పూస్తున్నా
సముద్రం గుండెల్లో గుబులురేపి
గంతులేయిస్తుందని గేయాలు పాడుకొంటూ
కొత్త గీతోపదేశాలు గుత్తకు తీసుకుని బతికేస్తాం
ఎదురీదే వాడు ఎవడన్నా ఉంటే
వాడిచావు వాడు చస్తాడంతే అని వొదిలేస్తాం

# మార్గదర్శి

మహాత్మా!
నీవు నడిచి వెళ్లిన బాటను
అక్షరాలతో పుస్తకాలనిండా ముద్రించుకున్నాం
భద్రంగా బీరువాల్లో దాచుకున్నాం

మహాత్మా!
నీవు విడిచివెళ్లిన ఆశయాలను
అందంగా మూటకట్టి
మా పిల్లలెవరికీ అందకుండా
ఆకాశపు ఉట్టిలో దాచిపెట్టాం

మహాత్మా!
మేమూ అంగవస్త్రమే చుట్టుకుని
వెళ్లిపోతామని
దొరికిన మైకుల ముందూ
ఫేస్‌బుక్ గోడల నిండా
తెగవాగాం
ఎడతెగని వీలునామాలు రాస్తూనే ఉన్నాం

మహాత్మా!
ఉత్ప్రేరకాలుగా మారాల్సిన వాళ్లం
ఉత్తమాటలుగానే మిగిలిపోయాం
మన్నిస్తావా?!

# తడిసిన జ్ఞాపకాలు

నీరంతా కన్నుల్లో
కనుకొలకుల్లో...
తడి మాత్రం తలపుల్లో
గుర్తొచ్చే జ్ఞాపకాల్లో
లోపల ముద్దముద్దవుతున్న
కారు అద్దంలా

చినుకుల మెట్లెక్కి
ఆకాశపు చీకటిగదిలోకి వెళుతున్న
హెడ్‌లైట్ కాంతిలా
ఆవిరైపోతున్న ఆశలు -

చుట్టూ టైర్లు తిప్పే
నీటి భూచక్రాలు
ముందరి అద్దం తిప్పే
వెలుగు పూల విష్ణు చక్రాలు
కారునిండా దీపావళి కాంతులు

ఒంటరి గుడిసెలో
గుడ్డి దీపంలా అతను
అమ్మ జోల పాటలా
అంబులెన్స్ గీతం వింటూ
కన్నీరంతా మబ్బుల కళ్లల్లో
జ్ఞాపకాలు మాత్రం తడి తలపుల్లో..!

## ఏం చెయ్యాలి!

నిన్ను దహించే అగ్ని
నీలో నువ్వే పుట్టించుకొన్నావన్నది తెలుసా?

నిన్ను తడిపే కరుణ
నీలోనే ఊరిందని తెలుసా?!
నిన్ను ధిక్కరించే శక్తి
నీలోంచి వచ్చిందని తెలుసా?
నీకూ బయటికీ తేడా నీవే కదా
ఇంతకీ నీవెవరు? నీ తోడెవరు??
మనిషీ!
నీ పరీమళం పీల్చే ఓపిక
నీకే లేనప్పుడు
కాలసముద్రానికి లాకు లెత్తి కొట్టుకుపోతున్నావు
ఎక్కడో ఎప్పుడో
చరిత్రకారుని గాలానికి చిక్కి
సజీవమైపోతున్నావ్
దానంతటదే దొరికే దారే వేదాంతమనుకుని
వార్ధక్యపు చెక్కిలి మీటి వివరణలిస్తూ
పాక్షిక నిజాలు విదిల్చి వెళ్లిపోతున్నావ్
ఎటో అటు
ఇప్పుడు నేనేం చేయాలి?!

# ప్రతికథనం

పదిలంగా పేడ ఉండ్రాళ్లు చుడుతోంది
ఏ వినాయకుడి కోసమో
ముఖ్మల్ బట్టలు సింగారించుకొంది
ఏ మునివేళ్లకు మెత్తదనం తినిపించడం కోసమో
దేహానికి దీపాన్ని తొడుక్కొన్నది
ఏ కళ్లకు
చీకటి రంధ్రాల చమత్కారాన్ని చూయించడం కోసమో
మూతినిండా పుప్పొడి పూసుకొన్నది
ఏ సంపర్కం సాధించడం కోసమో
జీవ సమాధి అయ్యింది
రంగుల రెక్కల పువ్వై తిరిగేందుకేనేమో
పట్టుకోసమో
తేనెపట్టుకోసమో
ఏదయితేనేం
ప్రకృతి కళ్యాణపు పనిలో
మనకు తప్ప
ప్రతి పురుగుకూ ఓ పాత్ర ఉంది
ప్రతి ప్రాణికీ ఓ చరిత్ర ఉంది

# నేను vs నేను

నాకూ నాకూ మధ్య ఖాళీ
అర్థవాహకాలలో నిషేధిత ఖాళీ స్థలంలా
ఆవేశ ప్రవాహాన్ని అదుపు చేసేందుకేమో

ఒక నేను
క్రొవ్వొత్తుల వెలుగుల వెంట కదులుతాను
మరోనేను
కరిగే క్రొవ్వొత్తులు చూసి కదిలిపోతాను
ఒకనేను
గులాబీ గుబాళింపుకు మురుస్తుంటాను
మరో నేను
గుచ్చుకుంటున్న ముళ్లు చూసి వెరుస్తుంటాను
ఒక నేను
రాజ్యంపై రాళ్లు రువ్వే సాహసిని చూసి
        అబ్బుర పడుతుంటాను
మరో నేను
ఫలితం చౌర్యం చేసే కేతిగాళ్లను చూసి
        కలవర పడుతుంటాను
ఖాళీకి
అటుపక్క నేనే
ఇటు పక్కా నేనే

# విచిత్ర బంధం

నన్ను నే పారేసుకొన్న దాకా
ఇక్కడిక్కడే తిరిగి
ఎంచక్కా వెదికి చంకనెత్తుకుపోయావు

ఇప్పుడేమో
అప్పుడప్పుడూ కనిపిస్తూ
నన్ను నాకు చూపించకుండా వేపుకు తింటున్నావు
నాలోనే
ఇంకొక నన్నును మొలిపించుకుని
యుద్ధం చేద్దామంటే
నిన్నటి నీవు ఈరోజు
ఆకాశమంతై అవకాశమే లేకుండా పోయింది
నాలోని నిన్ను పొదవి పట్టుకుని
వెనకి వెనక్కి నడుస్తూ పోతుంటే
నడివీధిలో జారిపోయావు
వెక్కివెక్కి ఏడవటమే మంత్రాలుగా
తపస్సు చేస్తునే ఉన్నా -
అందుకే
నీలో ఒక్క జ్ఞాపకాన్నైనా వెలిగిద్దామని
నీవు కాని, నేనూ కాని విచిత్ర మైత్రీ బంధమొకటి
గుండెలు మోస్తున్న బంట్రోతై! కాలాన్ని పీలుస్తూ బతుకుతోంది
కాగితాలపై అక్షరమై కదులుతోంది.

# యూ... !

ఒకానొక ప్రపంచంలో
లోపలా బయటా నిర్మింపబడి
'నువ్వు' అనబడతావు

మరో ప్రపంచంలో
జలపాతం కింది రాయిలా
కొత్తరాగంలో రంగరించబడతావు
ఇంకో ప్రపంచంలో
లోపలిని బయటా
బయటిని లోపలా తిరగేసి తొడుక్కుని
బతికేస్తుంటావు
ఒక ప్రపంచంలో మాత్రం
లోపలికి బయటకి సారూప్యతలు లెక్కించబడి
నగిషీలు చెక్కబడి
ఒకానొక
జ్ఞాపకంగా ముద్రించబడతావు
నీవు పారే అలవు మారుతున్న కలవు
నిన్ను నీలోకి వొంపుకోలేవు... నీ నుండి నిన్ను తెంపుకోలేవు
లోపలికి బయటకు తేడాలు చెరిగిపోయేనాటికి
నీ చిరునామా చిరిగిపోతుంది
నీవు
ఏ నీవువో చివరికి

## కెరటం - సముద్రం

నిన్న చెలరేగిన కెరటమా
ఉద్వేగం కలిగి కలిగి
ఉద్యోగమైపోయి
పనిమాని, పెత్తనం విత్తనాలు నాటి
ప్రశ్నల మొక్కలను పీకేయడం మొదలెట్టావా

పిచ్చికెరటమా
నేను సముద్రాన్ని
నా దాకా నడచివచ్చి చూడు
అప్పుడే కదా నా దారేంటో తెలిసి వచ్చేది
గాలితోలనప్పుడూ నిప్పు కూడా బూడిద కప్పుకోవాల్సిందే
నీవు మంత్రమై మోగటం నిజం కాదా
వాడు యంత్రమై వాగటం నిజం కాదా
నాలో ఏదో పసితనం ఎంత విలవిలలాడిపోతుందో
నీకెప్పుడు తెలియాలి
నడువు నడువ్ ఎంతసేపులే
ఇంకో కెరటమొచ్చి తగిలేంతవరకేగా
నేను సముద్రాన్ని
నేను సముద్రాన్ని, సగంలో విడిచిపెట్టడం
నాకు చేతకాదు
వీలయినంతగా వొడిసిపట్టుకుంటాను
నీవు పూసిన జాజిరంగు నీకే ఇచ్చి
నేను రేపు రక్తవర్ణంలో మెరిసిపోతాను

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vakyantam**

* * *